కథ

**భీమవరపు పురుషోత్తం**

# నేనూ-నా కుటుంబం

నా ఆలోచనలు అన్ని రకాలుగా సాగుతున్నాయి. సుధీర్‌కి నాకు మధ్య మౌనసంఘర్షణ జరుగుతోంది. దీపక్ కేంద్ర బిందువు. ఉద్యోగం స్త్రీ జన్మహక్కు అని నమ్మేదాన్ని నేను. భర్త చెప్పినంత మాత్రాన నేను ఉద్యోగం మానేయదల్చుకోలేదు.

దీపక్ మీద నాకు మాత్రం ప్రేమ లేదా! వాడు కూడా అలవాటు చేసుకుంటున్నాడు. నేను ఆఫీసు నుండి వచ్చేసరికి ఎనిమిదవుతుంది. అంతవరకూ హోంవర్కులవీ చేసుకుని ఏ టీవీయో పెట్టుక్కూర్చుంటాడు ఒక్కడూ.

చదువుకుని ఉద్యోగం చేస్తూ, ఆధునిక స్త్రీగా నా జీవనసరళిని నేనే తీర్చిదిద్దుకున్నాను. సమాజంలో నాకో గౌరవం, గుర్తింపు ఉన్నాయి. మహిళామండలి మీటింగ్‌కెళ్ళినా షాపింగ్‌కి వెళ్లినా ఫలానా సువర్చల అంటే ఎదుటివారి కళ్లల్లో మెరుపు గమనించాను.

సుధీర్ చెప్పింది వింటే అవన్నీ ఏమయిపోతాయి? కొడుకు కోసం ఉద్యోగం మానేసింది అంటే నవ్వుతారు. ఆలోచిస్తేనే సిల్లీగా ఉంది. అదోలా చూస్తారు. తనలో ఆధునికత లేదనుకుంటారు.

ఆ చూపులు నేను భరించలేను. ఆ కళ్లల్లో మెరుపు ఏమాత్రం తగ్గినా నేను భరించలేను. అయినా నేను దీపక్‌కి తల్లిగా ఏం లోటు చేస్తున్నానని అతిగా ఊహించుకోడం?

ఆఫీసు నుండి వచ్చిన తర్వాత వాడితోడిదేగా నా ప్రపంచం అంతా! వాడే కదా నా ఆశల మణిదీపం. మా ఇద్దరి ప్రేమ స్వరూపం వాడు. వాడు లేనిదే మా జీవితాల్లో వెలుగే లేదు!

వాడిని ప్రేమగా చూడాలంటే ఉద్యోగం మానేయాలని నిర్ణయించటం హాస్యాస్పదం. ప్రేమ ఎప్పుడూ ఉంటుంది... ఉద్యోగం పోతే రావటం కష్టం.

* * *

వేసవి సెలవులు. దీపూ ఇంట్లోనే ఉంటున్నాడు. టీవీ చూస్తూనో కంప్యూటర్‌లో వచ్చీరానివి ఆడుకుంటూనో ఉంటాడు. పదేళ్ల వాడికి.

నేను ఆఫీసు నుండి వచ్చాక అలసట తీరితే నాకు వాడితోనే లోకం. వాడి మాటలు, చేష్టలు వింటూ చూస్తూ కాలక్షేపం చేస్తాను.

కాస్త రిలాక్సయి వాడికి అన్నం పెట్టాను. నాలుగో అంతస్థు ఫ్లాటు మాది. బాల్కనీలో కూర్చుని భోజనానంతరం నేనిచ్చిన జ్యూస్ తాగుతున్నాడు.

పాలు వేడి చేసి కప్పులో పోసుకొని చిన్న టీ పొడరు ప్యాకెట్టు డిప్ చేశాను అందులో. టీ తయారైంది. టీవీ ఛానల్ మారుస్తూ టీ సిప్ చేశాను. మెదడుకి వేడిగా చేరుతోంది. నట్స్ ఫ్రై చేసి తెచ్చుకున్నాను. నోటికి ఉప్పగా కారంగా అందుతున్నాయి.

"దీపూ" అన్నాను.

రిప్లై రాలేదు.

మళ్లీ పిలిచాను. నిశ్శబ్దంగా ఉంది.

ఏదో అనుమానం వచ్చింది. 'ఏమయింది వీడికి' అనుకుంటూ లేచి బాల్కనీలోకొచ్చాను. ఆకాశంలో నక్షత్రాలు సమావేశమయ్యాయి చందమామ అధ్యక్షతన. పక్క అపార్టుమెంట్ల నుండి గాలిలో తేలి ఏవో మాటలు, నవ్వులు వినవస్తున్నాయి. చల్లగా ఉంది.

చిత్తరువులా నించొని ఉన్నాడు దీపక్. అటు తిరిగి ఉన్నాడు. "ఏరా అలా ఉన్నావే?" అన్నాను. నా గొంతు నాకే చిత్రంగా అనిపించింది.

దీపూ తిరిగాడు. మసక కాంతిలో ఆ కళ్లు వాలి ఉన్నాయి. 'అలక' అనుకొన్నాను. "ఏంరా అలా ఉన్నావే రా" పిలిచి హత్తుకున్నాను.

"మమ్మీ" అన్నాడు ఆర్తిగా.

నా గుండెతో ఆ గుండె మాట్లాడుతుంది. ఏదో చెప్పుకోవాలని చూస్తుంది.

ఇంతసేపటికి వచ్చి, మళ్లీ టీవీ చూస్తున్నావేంటని కోపం వాడికి.

"బోర్ కొడుతుందా" అన్నాను లాలనగా.

"ఊ..." అన్నాడు లోతుగా.

"బుక్స్ ఉన్నాయి కదా నాన్నా చదువుకోవచ్చు గదా!"

"బుక్స్ మాట్లాడవు కదా మమ్మీ"

నవ్వొచ్చింది. "అల్లరివాడా" అన్నాను తల నిమిరి. వాడి మాటలు మాత్రం నాలో తమ పని తాను చేసుకుంటూ పోతున్నాయి.

ఆయన సాఫ్ట్‌వేర్‌లో పనిచేస్తాడు నా లాగానే. కేడర్ కొద్ది పెద్దది. ఉదయం తొమ్మిదింటికి ఇల్లు వదిలితే రాత్రి పదింటికి చేరతాడు. ఇంటికి వచ్చాక దీపక్‌ని ఒక్క క్షణం విడిచిపెట్టడు. వాడు కూడా తండ్రి కోసం చకోరపక్షిలా ఎదురుచూస్తూంటాడు.

"అపార్టుమెంట్లో నీ ఫ్రెండ్స్ చాలామందే ఉన్నారు కదరా. వాళ్లతో ఆడుకొంటున్నావా"

"ఆడుకొంటున్నాను" అన్నాడు ముభావంగా. వాడి పలుకులో ధ్వని ఉంది!

టీవీ కట్టేసి వాడ్ని పక్కన కూర్చోపెట్టుకుని మాటలు చెబుతూ నవ్విస్తూ చాలాసేపు గడిపేను. నేనూ అలిసిపోయి రావటం మూలాన రోజూ తేరుకోడానికి కొంత సమయం పడుతుంది. అందుకే ఆయన వచ్చాకే చూసుకొంటారని ఒక్కోరోజు వాడితో పెద్దగా మాట్లాడను - మరీ డల్‌గా ఉంటే తప్ప.

కాసేపట్లో తేరుకుని ఉత్తేజంగా తయారయ్యాడు... నేను అలా మాట్లాడాలని వాడు కోరుకుంటాడు. ఒక్కోసారి వాడి కోరిక నెరవేరుతుంది.

"మమ్మీ! హాలీడేస్ అయిపోతే ఇంచక్కా నేను స్కూలుకెళ్లి పోతా" అన్నాడు దీపక్.

"ఏంట్రా, అంతా హాలీడేస్ ఇంకా ఉంటే బావుండునని కోరుకుంటుంటే, నువ్వేమిటి అయిపోవాలనుకొంటున్నావు!" అన్నాను.

"రోజూ ఇంట్లో కూర్చునే బదులు స్కూలుకి వెళ్లిపోతే హాయిగా ఫ్రెండ్స్‌తో ఆడుకోవచ్చు, చదువుకోవచ్చు కదా మమ్మీ"

వాడి మాటలకి ఏదో అర్థమవుతున్నా మనసు దాన్ని నొక్కిపడేస్తుంది. మనసు తొణికిసలాడుతోంది... నేను ఆఫీసు నుండి వచ్చేవరకూ వాడికి ఒంటరితనమే. ఇప్పుడు ఫిఫ్త్ క్లాసులోకి వస్తాడు. స్కూలుంటే నాలుగున్నరకి వచ్చేస్తాడు. నేను ఆఫీసు నుండి వచ్చేసరికి రోజూ ఎనిమిది, ఎనిమిదిన్నర అవుతుంది. అంతవరకూ వాడికి ఎదురుచూపులు తప్పవు.

పుట్టినప్పటి నుండి ఇలాగే అలవాటయ్యాడు. మొదట్లో ఆయా ఉండేది వాణ్ని చూసుకోడానికి. మనిషి మంచిది కాదని తర్వాత తెలిసింది. తమకు తెలీకుండా దీపక్‌ని కొట్టేది.

అల్లరి చేస్తే ఆమెకు నచ్చదు. దీపక్ చాలా చురుకైన తెలివైన కుర్రాడు. సహజంగా అలాంటి వాళ్లు అల్లరి చేస్తారు. యాంత్రికంగా సాకేది దీపక్‌ని. సున్నితంగా ట్రీట్ చేసేది కాదు. తమ ముందు మాత్రం నటించేది.

కొట్టినట్టు చెబితే చంపేస్తానని ముందే బెదిరించి పెట్టేది. అందువల్ల దీపక్ భయంతో తమ ముందు నోరు విప్పేవాడు కాదు. ఒకసారి దెబ్బలు బయటపడ్డంతో ఆమె ఉద్యోగం ఊడిపోయింది.

అప్పటి నుండి పక్కింటివాళ్లు ఎదురింటివాళ్లు సాయంతో నేను వచ్చేవరకూ దీపక్‌ని మ్యానేజ్ చేయటం అలవర్చుకున్నాం. అప్పటి నుండి అదే పద్ధతి బావుందనిపించింది!

* * *

సుధీర్ పదిన్నరకి బెల్ కొట్టాడు.

"దీపక్ ఏడీ" అన్నాడు.

"నిద్రపోయాడు"

"ఏమన్నా ఏడ్చాడా నువ్వొచ్చేసరికి... అల్లరి చేశాడా?"


"నేనొచ్చేసరికి టీవీ చూస్తున్నాడు. మనోజ్ఞతో మాట్లాడేను. బానే ఉంటున్నాడు అని చెప్పింది"

"ఊహు" నిట్టూర్పుతో విన్నాడు.

నా ఆలోచన్లు మనోజ్ఞ చుట్టూ తిరిగాయి. ఇద్దరు పిల్లలు వాళ్లకి. దీపక్ ఈడు వాళ్లే. ఆమె హౌస్‌వైఫ్, త్రుళ్లుతూ మసిలే వాళ్ల పిల్లల్ని చూస్తే నాకెందుకో ఏదోలా ఉంటుంది! మా ఎదురిల్లే వాళ్లది.

సుధీర్ మౌనం నన్ను గుచ్చుతుంది. స్నానం చేసి భోంచేసి బాల్కనీలో చల్లగాలికి కూర్చున్న ఆయన్ని హత్తుకున్నాను. చంద్రుణ్ని దాటి మేఘాలు ప్రయాణిస్తున్నాయి. వెన్నెలంటే మా ఇద్దరికీ చాలా ఇష్టం. అదే మమ్మల్ని కలిపింది.

"సుధా" అంటూ ప్రేమగా చుట్టుకున్నాడు నన్ను. 'హమ్మయ్య నాపై కోపం లేదు' అనుకొన్నాను. అప్పటికింకా నిద్రలో ఉన్న కొడుకుని ముద్దాడి వచ్చాడు, ఇప్పుడు నన్ను. భర్త ప్రేమలో మాధుర్యం, వైవిధ్యం తెలుస్తున్నాయి.



మా ప్రేమ వివాహం సక్సెస్ అనే చెప్పాలి. మా మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేవు. దీపక్ విషయంలోనే చిన్నపాటి విభేదం తప్ప!

ఇద్దరం బాగా చదువుకున్నాం. సాఫ్ట్‌వేర్‌లో జాబ్ చేస్తుండగా ప్రేమ పుట్టింది. పెళ్లయింది. దీపక్ పుట్టాడు. వాడంటేనే సుధీర్‌కి అలవిమాలిన ప్రేమ. వాడికి ఇసుమంత ఇబ్బంది కలిగినా విలవిల్లాడిపోతాడు.

ఇద్దరం ఉద్యోగాల్లో ఉండటంతో సంపాదన బావుంది. కావల్సిన వస్తువులన్నీ కొనుక్కుంటున్నాం. ఖరీదైన ఫ్లాట్‌లో ఉంటున్నాం. విలాసవంతమైన జీవన శైలిని రుచి చూస్తున్నాం. నేను ఉద్యోగం మానేస్తే? అమ్మో! అంతా తలకిందులైపోదూ. ఆధునిక మహిళ స్థానం నుండి నా మనసు తల్లి స్థానం వైపే వొరిగింది!

అందుకే ఇంకో ప్రశ్న పుట్టి ఉల్కాపాతంలా మొదటి ఆలోచన్ని ఖండించింది. ఏమవుద్ది? నేను ఉద్యోగం మానేస్తే, ఏం కాదు. ప్రపంచం తల క్రిందులై పోదు. అంతా సాఫీగానే ఉంటుంది. మా జీవనశైలిలో పశ్చాత్తాపపడేటంత మార్పు ఏదీ రాదు. ఇంత విలాసవంతంగా ఉండలేమంతే.

దీపక్‌ని దృష్టిలో పెట్టుకుని మంచి నిర్ణయం తీసుకోవాలని మనసు ఆత్రపడుతోంది. నేనెంతో ప్రేమించిన సుధీర్ కోరిక నెరవేర్చడాన్ని అవ్వాలనుంది.

ఉద్యోగం మానేసి ఇంటి పట్టే గృహిణిలా ఉంటూ దీపక్‌ని జాగ్రత్తగా చూసుకోవాలని సుధీర్ అభిమతం. కానీ, అలా అని ఎప్పుడూ నన్ను వత్తిడి చేయలేదు. ఒక స్త్రీగా భార్యగా అణువణువునా నన్ను, నా అభిప్రాయాన్ని గౌరవంగా చూస్తాడు. అదే అతడి గొప్పతనం. అందుకే సుధీరంటే నాకు ప్రాణం.

సుధీర్‌కి నాకూ మధ్య మౌనసంఘర్షణ. పుబ్బలో పుట్టి మఖలో కరిగిపోయేది కాదు. ఎందుకంటే పసివాడి హక్కులు ముడిపడి ఉన్నాయి దీంతో... క్రమంగా నాకేదో అర్థమవుతోంది.

దీపక్ మా మధ్య నలిగిపోతున్నాడు. వాడు కోల్పోయేది చూడ్డానికి చిన్నగా కనిపించినా వాస్తవానికి చాలా పెద్దది. ఆ చిన్న చిన్న ఆనందాన్ని ఏ త్రాసులోనూ తూయలేం. పాపం దీపక్ ఒంటరిగా సినిక్‌గా మారిపోతున్నాడు. శ్రీమంతుడైన అనాథలా పెరుగుతున్నాడు.

పొరుగింటి మనోజ్ఞ కుటుంబం నాకు మోడల్‌గా కనిపిస్తుందిప్పుడు. పిల్లల్ని బాగా అర్థం చేసుకొని పెంచుతుందామె. వేసవి సెలవుల్లో వాళ్లకి డ్యాన్సు, సంగీతం, పెయింటింగ్ లాంటి కళల్ని దగ్గరుండి టీచర్లను పెట్టి నేర్పిస్తుంది. వాళ్లకు ఎప్పటికప్పుడు మంచి పౌష్టికాహారం ఇస్తుంది.

అనుక్షణం వాళ్లను కనిపెట్టుకుని ఉంటుంది. మంచి అలవాట్లు నడవడిక పిల్లలకు నేర్పే అంతిమ గురువు తల్లే. పిల్లల్ని పెంచటం గొప్ప కళ అని మనోజ్ఞను చూసి నాకు తెలిసింది. మనోజ్ఞ స్థానంలోకి నేను రాలేనా అని తోస్తోందిప్పుడు!

నా బిడ్డ కూడా వాళ్ల పిల్లల్లా స్కూలు నుండి రాగానే బ్యాగు విసిరేసి మమ్మీని చుట్టుకోవాలి. అంతేగానీ, ఇంత చిన్న వయసులో బెరుకుగా తల్లి ఆఫీసు నుండి ఎప్పుడొస్తుందా అని పడిగాపులు పడకూడదు.

నా నిర్ణయం మా కుటుంబాన్ని ఎంత ప్రభావితం చేస్తుందో తల్చుకుంటే మనసు తేలికపడింది. అప్పుడర్థమయింది నాకు, నా నిర్ణయం కరెక్టేనని.

★ ★ ★

తెల్లవారింది. సుధీర్ కళ్లు తెరిచి నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. "అదేమిటి వాలకం ఆఫీసు లేదా?" తెల్లబోయాడు నైట్‌డ్రెస్‌లో నన్ను చూసి.

నవ్వాను. నా నవ్వులో మాధుర్యానికో ఏమో విప్పారిన ముఖంతో చూశాడు. అందులో ఇంకా ప్రశ్న వీడలేదు. మా ఇరువురి మధ్యా దీపక్ బిత్తరచూపులు చూస్తున్నాడు నిద్రకళ్లతో.

అమాయకత్వంతో, మమ్మీ డాడీ వెళ్లిపోయాక ఈ రోజు ఒంటరితనాన్ని ఎలా భరించాలి అనుకొని మానసికంగా సమాయత్తమవుతున్న వాడిని పొదివికి హత్తుకుని చెప్పాను నవ్వు కళ్లతో. "జాబ్‌కి రెండు రోజులు సెలవు. తర్వాత ఫైనల్ బెనిఫిట్స్ ఏమైనా వస్తే సెటిల్ చేసుకొని శాశ్వతంగా సెలవు!"

సుధీర్ మొహంలో ఒక మెరుపు మెరిసింది. ఆ రోజు అతడి కళ్లల్లో వెల్లువెత్తిన పరవశం, మా మాటల్లో ఏదో అర్థమై సంతోషంగా నా చేతిని ముద్దాడిన దీపక్ ముద్దు తడి, నేను ఎప్పటికీ మర్చిపోలేను.

○